సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం ౹ 9 ౹ సెప్టెంబర్ ౹ 2024



జాగ్రత్తలతో అవిఘ్నమస్తు

వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఉత్సవ కమిటీలు కూడా తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. -8లో



విషాదం మిగిల్చిన ప్రయాణం

వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో ఆదివారం రహదారులు రక్తమోడాయి. వివిధ ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.270	రూ.320
రెండోరకం	రూ.200	రూ.266

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 210 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

రూ.1.5 లక్షలు పలికిన లంబోదరుడి లడ్డూ



బాసినేని వెంకటేశ్వర్లుకు లడ్డూను అందజేస్తున్న నిర్వాహకులు

రాజంపేట టౌన్: మండలంలోని ఎగువబసినాయుడుగారిపల్లెలో వినాయకుడి లడ్డూ రూ.1.5 లక్షలు పలికింది. వినాయక చవితిని పురస్కరించుకొని ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేలం నిర్వహించారు. అదే గ్రామానికి బాసినేని వెంకటేశ్వర్లు లక్షా ఐదు వేల రూపాయలకు స్వామివారి లడ్డూను దక్కించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది స్వామివారి లడ్డూ దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

గంగమ్మా..కాపాడవమ్మా..



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లె: గంగమ్మా.. కరుణించి కాపాడు తల్లీ అంటూ మండలంలోని అనంతపురం గంగమ్మను భక్తులు వేడుకున్నారు. ఆదివారం ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గంగమ్మను దర్శించుకున్నారు. మొక్కులు ఉన్నవారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. తలనీలాలు అర్పించారు.అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీనా.. అదనపు బాధ్యతలా?

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ముగ్గురు ఎస్‌ఐలను బదిలీ చేశారంటూ ఆదివారం ప్రచారం సాగింది. దీనిపై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందలేదని పోలీసు వర్గాలు చెబుతుండగా స్థానికంగా పని చేస్తున్న ఎస్‌ఐలను విధుల నిమిత్తం ఇతర పోలీస్‌స్టేషన్ల బాధ్యతలు అప్పగించారని అంటున్నారు. అయితే టీడీపీలోని ఓ వర్గం ఇటీవల సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేయడంతో చర్యలు తీసుకున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరిగింది. ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌ను పీలేరుకు, ములకలచెరువు ఎస్‌ఐ గాయత్రిని రాయచోటి దిశ పోలీస్‌స్టేషన్‌కు, తంబళ్లపల్లె ఎస్‌ఐ లోకేష్‌రెడ్డిని రాజంపేట డీఎస్పీ కార్యాలయానికి పంపారని పోలీసు వర్గాల సమాచారం. ఉన్నతాధికారుల నుంచి అందిన మౌఖిక ఆదేశాల మేరకు ఈ ఎస్‌ఐలు అక్కడ విధులు నిర్వహిస్తారని చెబుతున్నారు. దీనిపై మదనపల్లె డీఎస్పీ రెడ్డెయ్యనాయుడు మాట్లాడుతూ డూయింగ్ డ్యూటీలో భాగంగా ఎస్‌ఐలు ఆయా స్టేషన్లలో పనిచేసేలా ఆదేశాలొచ్చాయని, అవి బదిలీలు కాదని స్పష్టం చేశారు. ఈ ఎస్‌ఐల పరిధిలోని స్టేషన్ల పర్యవేక్షణ బాధ్యతలను తాము చూస్తామని చెప్పారు.

ఎక్కడి పనులు అక్కడే!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరుగులెత్తిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ఇప్పుడు నత్తనడకన సాగుతోంది. కూటమి ప్రభుత్వం అక్టోబర్ రెండు నాటికి జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలని వందరోజుల ప్రణాళిక సిద్ధం చేసినా కదలిక లేదు. కలెక్టర్ శ్రీధర్ నిత్యం సమీక్షలు చేస్తూ, ఒక్కో లే–ఔట్‌కు ఒక ప్రత్యేక అధికారిని నియమించినా ప్రయోజనం కనిపించడం లేదు. మదనపల్లె, రాయచోటి డివిజన్లలో ఇళ్ల నిర్మాణాలు పడకేశాయి. గృహనిర్మాణశాఖ అధికారుల్లో చలనం కొరవడింది. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తికావచ్చిన ఇళ్లను వందరోజుల ప్రణాళికలో పూర్తి చేసినట్టు చెప్పుకొంటున్నారు.

- ముందుకు సాగని పక్కా గృహాల నిర్మాణాలు
- వంద రోజుల లక్ష్యం ఘనం.. ఆచరణ శూన్యం
- జూన్ 5 నుంచి ఇప్పటి వరకు చేసిన ఖర్చు రూ.5 కోట్లే
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్‌సీ ఇళ్లు ఇప్పటి ఖాతాలోకి




కురబలకోట మండలం బ్రాహ్మణ ఒడ్డుపల్లెలో పునాదులకే పరిమితమైన ఇళ్ల నిర్మాణాలు

బి.కొత్తకోట: కూటమి ప్రభుత్వం వందరోజుల ఇళ్ల నిర్మాణాల ప్రగతిని లక్ష్యంగా చేసుకుని జిల్లాకు 4,840 ఇళ్లను పూర్తి చేయాలని నిర్దేశించింది. దీంతో ఈనెల ఏడో తేదీ వరకు చూపిన ప్రగతి నివేదికలో జిల్లాలో 1,663 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. సగటున రోజుకు 28 ఇళ్లను పూర్తి చేయాలి.అయితే గత ప్రభుత్వానికి చెందిన ఇళ్ల ప్రగతిని కూడా కలిపేసుకుని లెక్కలు వేస్తున్నట్టు అర్థమవుతోంది. జూన్ 4 నాటికి ఇళ్ల పైకప్పు శ్లాబ్ పూర్తి చేసిన గృహాలు 4,745. గోడలకు ప్లాస్టింగ్ చేస్తే ఇళ్లు పూర్తయినట్టు. ప్రస్తుతం జూన్ 5 నుంచి ఈనెల ఏడు వరకు పైకప్పు శ్లాబ్ వేసిన ఇళ్ల సంఖ్య 3,883గా చూపుతున్నారు. అంటే పూర్తయినట్టు చెబుతున్న ఇళ్ల సంఖ్యలో 862 గత ప్రభుత్వంలో పూర్తి చేసినట్టు లెక్క.

- ఈ ప్రభుత్వంలో పనులు వేగంగా జరిగివుంటే శ్లాబ్ పనులు జరిగిన ఇళ్ల సంఖ్య పెరగలేదు కానీ 1,663 ఇళ్లు పూర్తి చేశామని గృహనిర్మాణశాఖ గొప్పలు చెప్పుకుంటోంది. జూన్ 5 నుంచి ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాల కోసం రూ.5.01 కోట్లు మాత్రమే ఖర్చు చేశారంటే ఏమేరకు ఇళ్ల నిర్మాణాల ప్రగతి ఉందో ఇట్టే అర్థమవుతుంది.

3,177 ఇళ్ల పూర్తి ఎప్పటికి

అక్టోబర్ రెండుకు జిల్లాలో 4,840 ఇళ్లు పూర్తి కావాలి. వంద రోజుల ప్రణాళిక పూర్తికి మిగిలింది 23 రోజులే. గృహనిర్మాణశాఖ అధికారులు చెబుతున్నట్టు ఇప్పటికే 1,663 ఇళ్లు పూర్తిచేసినా ఇంకా 3,177 ఇళ్లను పూర్తి చేయించాలి. అంటే సగటున రోజుకు 139 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలి. ఈ మేరకు గృహనిర్మాణశాఖ సిద్ధంగా ఉందా అన్నది ప్రశ్నార్థకమే.అధికారులు చెబుతున్నట్టు మదనపల్లె, రాయచోటి డివిజన్లు ప్రగతిలో తొమ్మిది శాతానికే పరిమితమైంది. అంటే రాజంపేట డివిజన్ మాత్రమే పనుల్లో పురోగతి చూపిస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.



జూన్ 4 నాటికి జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు

చేపట్టిననిర్మాణాలు: 75,619	
పూర్తయినవి: 33,069	
ప్రారంభంకానివి: 1,123	
బీబీఎల్: 9,748	పీబీ: 349
బీఎల్: 19,578	ఎల్ఎల్: 856
ఆర్ఎల్: 6,151	ఆర్‌సీ: 4,745
బిల్లుల చెల్లింపు: రూ.720.64 కోట్లు	
మెటీరియల్ సరఫరా: రూ.116.60 కోట్లు	
మొత్తం ఇళ్ల ఖర్చు: రూ.838.81 కోట్లు	

జూన్ 5 నుంచి ఇళ్ల స్థితి

చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు: 46,551	
పూర్తయినవి: 1,663	
ప్రారంభంకానివి: 4,320	
బీబీఎల్: 14,809	బీఎల్: 19,440
ఆర్ఎల్: 6,756	ఆర్‌సీ: 3,883
బిల్లులు, మెటీరియల్ ఖర్చు: రూ.5.01 కోట్లు	

బిల్లుల పెండింగ్ లేదు



జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటున్న లబ్ధిదారులకు బిల్లుల సమస్య లేదు. ప్రతి రెండురోజులకు ఒకసారి వారి ఖాతాలకు బిల్లులు జమ అవుతున్నాయి. దీంతో పనులు వేగవంతంగా చేయిస్తున్నాం. వెనుకబడిన మదనపల్లె, రాయచోటి డివిజన్లలో పనులు వేగం పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. వందరోజుల ఇళ్ల నిర్మాణ లక్ష్యం సాధిస్తాం. –శివయ్య, జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి

శాస్త్రోక్తంగా బాలాలయ ప్రతిష్ట



ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి దేవాలయంలో ఆదివారం బాలాలయ ప్రతిష్ట కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభమైన పూజా కార్యక్రమాలు ఆదివాం ముగిశాయి. ఇందులో భాగంగా వేదపండితుడు రాజేష్ బట్టర్, అర్చకులు కలిసి విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, మహా పూర్ణాహుతి, బాలాలయ చిత్రపట శాంతి ప్రోక్షణ జరిపారు. సీతారామ లక్ష్మణ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను బాలాలయ దర్శనానికి అనుమతించారు.

కనీస ఏర్పాట్లు కరువు

బలాలయంలో టీటీడీ అధికారులు భక్తుల సౌకర్యార్థం కనీస ఏర్పాట్లు చేయలేదు. కేవలం తాత్కాలిక పైపుల షామియానా వేశారు. వర్షం, గాలులకు పైపుల షామియానా వాలిపోయిందని, దీంతో తడుస్తూనే దర్శనానికి వెళ్లాల్సి వచ్చిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థిరమైన క్యూలైన్‌తో పాటు ఎండకు, వానకు ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ఈ విషయం గురించి సివిల్ డిపార్ట్‌మెంట్ డీఈ నాగరాజుతో మాట్లాడగా సోమవారం నుంచి స్థిరమైన క్యూలైన్లు ఏర్పా చేస్తామని, భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు.



వానలో తడుస్తూ దర్శనానికి వెళుతున్న భక్తులు

మది మదిలో వినాయకుడు



మదనపల్లెలో అయోధ్య రాముడిగా గణపయ్య

- వాడవాడలా నవరాత్రి ఉత్సవాలు
- జిల్లాలో 2,749 విగ్రహాలకు ప్రత్యేక పూజలు


రాయచోటి: వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆది పూజల దేవుడు, శివపార్వతుల ముద్దుల తనయుడు గణపతికి శని, ఆదివారాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. జిల్లా పరిధిలోని రాయచోటి, మదనపల్లె, తంబళ్లపల్లి, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో 2,749 విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇందులో రాజంపేట డివిజన్‌లో 857, రాయచోటి డివిజన్‌లో 1030, మదనపల్లె పోలీస్ డివిజన్ పరిధిలో 862 విగ్రహాల వంతున ఏర్పాటు చేశారు. ఊరూ వాడా చిన్నా పెద్దా తేడా లేకుండా మతాలు, కులాలకు అతీతంగా విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలలో పాల్గొంటున్నారు. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాలకు చెందిన పెద్దలు పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసింది. చిన్నపాటి ఘర్షణలకు అవకాశం ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించాలని పోలీసులు సూచించారు.

పోటాపోటీగా వినాయక ప్రతిమల ఏర్పాటు

వినాయక విగ్రహాలను భక్తులు పోటాపోటీగా ఏర్పాటు చేశారు. అడుగు నుంచి 15 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను ఏర్పాటు చేసి మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. విగ్రహాల వద్ద ప్రతి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు.



రాయచోటిలోని బోస్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ



రైల్వేకోడూరు: కాళీయమర్దనుడిగా గణపయ్య

ప్రొటోకాల్‌కు మంగళం!

- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు
- స్థానిక ఎమ్మెల్యే లేకుండానే ఇసుకరీచ్ ప్రారంభం



ఇసుకరీచ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఆకేపాటి లేకుండానే ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి (ఫైల్)

రాజంపేట: అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా వివిధ శాఖల అధికారులు ప్రొటోకాల్‌కు మంగళం పాడే సంస్కృతికి తెర తీశారు. ఈ విషయంలో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెలువడుతున్నాయి. ఈనెల 6న రాజంపేట–రాయచోటి రహదారిలోని ఆర్‌బుడుగుంటపల్లెలో ఇసుక రీచ్‌లను జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారికంగా ప్రారంభించారు. అయితే స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి లేకుండానే మంత్రి ప్రారంభం చేసి, తమ పార్టీ నేతలకు కూడా తెలియకుండానే వెళ్లిపోయారు. ఎమ్మెల్యే, మంత్రిగా ఉండి, కనీసం స్థానిక ఎమ్మెల్యేను ప్రొటోకాల్ ప్రకారం పిలవలేదా అని కూడా ఆరా తీయకపోవడం, కనీసం చట్టసభల ప్రతినిధుల నిబంధనను ఆయన పాటించకపోవడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది.

ప్రొటోకాల్ పాటించని వారిపై ఫిర్యాదు చేయనున్న ఎమ్మెల్యే

రాజంపేట మండలం ఆర్‌బుడుగుంటపల్లెలో చెయ్యేరులోని ఇసుక రీచ్‌ను ప్రారంభించిన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నారు. అలాగే అసెంబ్లీ స్పీకర్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి ఎమ్మెల్యే తప్పిన ప్రొటోకాల్ గురించి ఫిర్యాదు చేయనున్నారు.

తెల్లారేసరికే విజయవాడలో ఉండాలి

- వినాయకచవితి రోజు రాత్రి అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు

బి.కొత్తకోట: వినాయక చవితి పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా చేసుకుంటున్న అధికారులు, ఉద్యోగులకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ నుంచి శనివారం రాత్రి అందిన ఆదేశాలతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. 'మీరు వెంటనే బయలుదేరి విజయవాడ వెళ్లండి. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో హాజరుకావాలి. లేకపోతే చర్యలు తప్పవు...' అంటూ కలెక్టర్ నుంచి అందిన ఉత్తర్వులతో అధికారులు, ఉద్యోగుల్లో పండుగ ఆనందం ఆవిరైంది. వెంటనే బ్యాగులు సర్దుకుని బైకులు, బస్సుల్లో తిరుపతి చేరుకున్నారు. అక్కడి నుంచి బస్సులు, రైళ్లలో విజయవాడ బయలుదేరి వెళ్లారు. విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో ఐదు రోజులు విధులు నిర్వర్తించేందుకు ఎంపిక చేసిన వారి జాబితాలతో కలెక్టర్ శ్రీధర్ మూడు ఉత్తర్వులు జారీచేశారు. అందులో జిల్లాలో పని చేస్తున్న ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు(ఎస్‌డీసీలు) ఎస్.రాఘవేంద్ర, ఎం.రామసుబ్బయ్య, ఎస్.రాము, యు.రంగస్వామి, బి.లీలారాణి, జిల్లాలో నందలూరు, టి.సుండుపల్లె, రాయచోటి, చిన్నమండెం, గుర్రంకొండ, పీలేరు, బి.కొత్తకోట, నిమ్మనపల్లె, పీటీఎం, ములకలచెరువు, వాల్మీకిపురం, కేవీపల్లె మండలాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లను విజయవాడకు వెళ్లాలని ఆదేశించారు. వీరితోపాటు 55 మంది డిప్యూటీ తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు, ఆర్ఎస్‌డీటీలు, 24 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు స్పెషల్ ఆర్‌ఐలు, 15 మంది ఎంఆర్‌ఐలు, ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్, 37 మంది వీఆర్‌వోలు ఉన్నారు.

ఖాకీ వనంలో కలుపుమొక్కలు!

'ఖాకీ' వనంలో తులసిమొక్కలతో పాటు కలుపు మొక్కలూ పెరుగుతున్నాయా..? దురుసు ప్రవర్తనతో 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అర్థాన్నే మార్చేస్తున్నారా..? ఇటీవల జరిగిన సంఘటనలు చూస్తే అవుననే సమాధానమే వినిపిస్తోంది. కొందరు పనిలో ప్రతిభ చూపి అటు అధికారులు.. ఇటు ప్రజల మన్ననలందుకుంటుంటే.. ఇంకొందరు వ్యక్తిగత దురుసు ప్రవర్తనతో వ్యవస్థకే మచ్చ తీసుకొస్తున్నారు.

- వ్యక్తిగత దురుసు ప్రవర్తన వ్యవస్థకే మచ్చ
- ప్రకృతి సంపద ఆసరాగా అక్రమార్జనలో మరికొందరు
- రిమ్స్‌లో ఎస్‌ఐ వీరంగం... ఆపై అడిషనల్ ఎస్పీ మధ్యస్థం
- దిగజారిన పోలీసు ప్రతిష్ట

» మొన్న.. పులివెందుల పూలఅంగళ్ల సర్కిల్‌లో ఇద్దరు ట్రాన్స్‌కో ఉద్యోగులపై అర్ధరాత్రి ఎస్‌ఐ అనిల్‌కుమార్ దాడి చేశారు. జయమ్మ కాలనీలో విద్యుత్ అంతరాయం ఏర్పడితే మరమ్మతులు చేసి వస్తున్నామని జూనియర్ లైన్‌మెన్లయిన గురురాజ్, షఫీ చెబుతున్నా విన్పించుకోకుండా 'మీలాంటోళ్ల వల్లే దొంగతనాలు తెరపైకి వస్తున్నా'యని కర్రపెత్తనం చేశారు. ఉదయాన్నే ట్రాన్స్‌కో యంత్రాంగం నిరవధిక నిరసనకు దిగేందుకు సమాయత్తమయ్యారు. ఈలోపు ఎస్‌ఐపై సత్వర చర్యలు తీసుకోవడంతో ట్రాన్స్‌కో ఉద్యోగులు వెనక్కి తగ్గారు.

› నిన్న.. ఎస్‌ఐ జయరాముడు రాత్రి రిమ్స్ కళాశాలలోకి వెళ్లారు. వినాయక మండపం వద్ద మైకు ఏర్పాటు చేయడాన్ని అడ్డుకున్నారు. డెంటల్ విద్యార్థులతో గొడవపడి మండపం వద్ద ఏర్పాటు చేసుకున్న మైకుసెట్ పోలీసు జీపులో వేసుకున్నారు. అనుమతులున్నా ఎందుకు తీసుకెళ్తున్నారని అడ్డుకున్న డెంటల్ విద్యార్థులపై వీరంగం చేశారు. అంతటితో ఆగకుండా మెడికల్ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న మండపం వద్దకెళ్లారు. అక్కడా అదే స్థాయిలో జూనియర్ డాక్టర్లతో గొడవపడ్డారు. రెండు సెల్ ఫోన్లు పగలగొట్టారు.

☛ ఇటీవల వెలుగులోకి వచ్చిన ఈ రెండు సంఘటనలే కాదు.. వెలుగులోకి రాని ఘటనలు అనేకం. కొంతమంది అధికారులు 'ఫ్రెండ్లీ పోలీసు'అనే పదానికి అర్థం లేకుండా వ్యవహరిస్తున్నారు. తల బిరుసుతనంతో కొందరు, అక్రమార్జన కోసం మరికొందరు, రాజకీయ పరపతి కోసం ఇంకొందరు వ్యవస్థకు మచ్చ తెస్తున్నారు. స్వీయ నియంత్రణ లేకపోవడం, 'ఖాకీలం మాకేమన్న' అహం.. ఈ రెండు కారణాలు పతనావస్థకు దారి తీయడానికి ప్రధానమని ప్రజాస్వామ్యవాదులు వాపోతున్నారు.

సాక్షి ప్రతినిధి, కడప: ఇటీవల కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యా.హత్యాచారం ఘటన దేశవ్యాప్తంగా ఆందోళనకు దారి తీసింది. దేవుడు తర్వాత దేవుడయిన డాక్టర్లకు రక్షణ ఇవ్వాలని సమాజం నినదించింది. మరి రక్షణ కల్పించాల్సిన ఆ రక్షక భటుల నుంచే రక్షణ లేకపోతే.. అవును.. శనివారం ఇదే జరిగింది. రిమ్స్ డెంటల్, మెడికల్ జూనియర్ డాక్టర్లకు ఈ చేదు అనుభవం ఎదురైంది.వివరాల్లోకి వెళితే.. రిమ్స్ పరిధిలో వినాయక విగ్రహ మండపాన్ని పరిశీలించడానికి ఎస్‌ఐ జయరాముడు అక్కడికి వెళ్లారు. అక్కడ అభ్యంతరకర దృశ్యాలుంటే అడ్డుచెప్పి చర్యలు తీసుకోవడం తప్పేమీ కాదు. అలా కాకుండా మైకు పెట్టుకున్నారని గొడవలు సృష్టించాడు. ఇది ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. అన్ని అనుమతులున్న పటికీ, ఎలాంటి ఫిర్యాదు లేకపోయినా వారి వద్దకెళ్లి రచ్చ పెట్టుకోవడంపై జూడాలు ఆవేదన చెందుతున్నారు.

భయపెట్టి సర్దుబాటు చేస్తారా!

రిమ్స్ ఎస్‌ఐ జయరాముడు వ్యవహారంపై ఏఎస్పీ వెంకటరాముడు దిద్దుబాటు చర్యలు చేపట్టడంలో సక్సెస్ అయ్యారు. అంతవరకూ బాగానే ఉంది. దిగజారిన పోలీసు ప్రతిష్ట కాపాడడంలో విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. డెంటల్ కళాశాలలో ఓ విద్యార్థి వద్ద డ్రగ్స్ పట్టుబడ్డాయని కేసు పెడ తామని బెదిరించి, వారి నుంచి ఫిర్యాదు లేకుండా జాగ్రత్త పడ్డారు. అదేస్థాయిలో డ్యూటీలో ఉన్న ఎస్‌ఐ జయరాముడి విధులకు ఆటంకం కల్గించారని కేసులు పెడతామని హెచ్చరించి జూనియర్ డాక్టర్లు ఫిర్యాదు ఉపసంహరణ చేసుకోవడంలో ఏఎస్పీ కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. జూనియర్ డాక్టర్ల మనోస్థైర్యం దెబ్బతీసి, ఎస్‌ఐని రక్షించుకునే దిశగా అడుగులు వేయడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.



›› కలుపు మొక్కలు కట్టడి అయితే..

వైఎస్సార్ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు సమర్థవంత అధికారిగా గుర్తింపు ఉంది. ఆయనకు బాసటగా సిబ్బంది నిలిస్తే పోలీసు ప్రతిష్ట మరింత పెరుగుతోంది. కాగా కొంతమంది అధికారులు ప్రకృతి సంపదను ఆసరాగా చేసుకొని అక్రమార్జనలో మునిగి తేలుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తూ జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలొస్తున్నాయి. కడప సబ్ డివిజన్ పరిధిలో ఓ ఎస్‌ఐ వారానికి ఒక ట్రాక్టర్‌కు రూ.15వేలు చెల్లించేలా ఒప్పందం చేసుకొని పాపాఘ్ని నదిలో ఇసుకాసురులను ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. కేవలం ఖాకీ వనంలోని కొందరి కలుపు మొక్కల వల్లే ఇలాంటివి ఉత్పన్నమవుతున్నాయి. వీరిని కట్టడి చేస్తే పోలీసు ప్రతిష్ట మరింతగా పెరుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి పోలీస్ బాస్ ఆ దిశగా చర్యలు చేపడతారో లేదో చూడాలి.

సమస్యాత్మక ప్రాంతాల్లో కూంబింగ్

సిద్దవటం: సిద్దవటం అటవీశాఖ పరిధిలోని గొల్లపల్లె బీట్‌లో సమస్యాత్మక ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి కూంబింగ్ నిర్వహించామని రేంజర్ కళావతి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు గొల్లపల్లె బీట్‌లోని తాపల రస్తా, ఏటిమడుగు, నిమ్మకాయల బండ, మరికొన్ని ప్రాంతాల్లో ఎర్రచందన స్మగ్లర్ల కోసం కూంబింగ్ నిర్వహించామన్నారు. అటవీ సంపద తరలి పోకుండా అణువణువు గాలింపు చర్యలు చేపట్టామన్నారు. అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న కొన్ని గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే మాకు సమాచారం ఇవ్వాలని రేంజర్ కళావతి ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె. ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గాజుల భాస్కర్



రాయచోటి (జగదాంబసెంటర్) : అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గాజుల భాస్కర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన జింక

రామాపురం : కుక్కలు దాడి చేయడంతో ఓ జింక మృతి చెందినట్లు ఇన్‌చార్జి ఫారెస్టు సెక్షన్ అధికారి భరణికుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు శనివారం అటవీ ప్రాంతం నుంచి జింక రావడంతో కుక్కలు వెంబడించి దాడి చేశాయి. మండల కేంద్రం సమీపంలో సరస్వతిపల్లె క్రాస్ రోడ్డు ప్రాంతంలో జింక మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు ఫారెస్టు అధికారులు జింకను స్వాధీనం చేసుకున్నారు. పశు వైద్యాధికారి మహేష్ పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఫారెస్టు సిబ్బంది అటవీ ప్రాంతంలో ఖననం చేశారు.

నల్లపురెడ్డిపల్లిలో కుక్కల స్వైర విహారం

పెనగలూరు: మండలంలోని నల్లపురెడ్డిపల్లి గ్రామంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మూడు రోజుల నుంచి ముగ్గురిపై దాడి చేయగా చంద్ర కళావతి అనే మహిళ పరిస్థితి విషమంగా ఉంది. మెరుగైన చికిత్స నిమిత్తం ఆమెను తిరుపతి ఆసుపత్రికి తరలించారు. అలాగే దళితవాడకు చెందిన చిన్నయ్య అనే వ్యక్తిపై కుక్కలు దాడి చేసి వేళ్లు కొరికేశాయి. గేదెలపై దాడి చేయడంతోపాటు, పెంచుకుంటున్న కోళ్లను కుక్కలు ఆహారంగా తీసుకుంటున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. కుక్కలబారినుంచి కాపాడాలని నల్లపురెడ్డిపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలి

రాయచోటి అర్బన్ : రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలని జనవిజ్ఞానవేదిక (జేవీవీ) రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని విజ్ఞాన్‌స్కూల్ ఆవరణంలో జేవీవీ జిల్లా వార్షిక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏ,హెచ్ ప్రకారం ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. సైన్స్ అనేది లేబొరేటరీలో పుట్టింది కాదని సమాజంలోనే పుట్టిందన్నారు. సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ ప్రజల్లో మూఢనమ్మకాల తొలగింపునకు జేవీవీ కృషి చేస్తోందన్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడు హరీంద్రనాథశర్మ, జిల్లాసైన్స్ అధికారి ఓబుళరెడ్డి, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మానవత రాష్ట్ర కమిటీ సభ్యుడు సహదేవరెడ్డి, డాక్టర్ రెడ్డెన్న, మాజీ సైనికోద్యోగి నారాయణరెడ్డి, జేవీవీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో అవిఘ్నమస్తు

- గణేష్ నిమజ్జనానికి ఆసన్నమైన సమయం
- నేటి నుంచి ప్రారంభం కానున్న నిమజ్జన వేడుకలు
- జాగ్రత్తలు తీసుకుంటేనే సురక్షితం



రాజంపేట టౌన్ : జీవితం ఎంతో విలువైనది. అయితే కొంత మంది పండుగలు, ఉత్సవాల సందర్భంగా అత్యుత్సాహాన్ని ప్రదర్శించే క్రమంలో ప్రాణాలనే పోగొట్టుకుంటుండటం చాలా బాధాకరమైన విషయం. ముఖ్యంగా వినాయక చవితి నిమజ్జన వేడుకల సందర్భంగా ఎక్కువగా అపశ్రుతులు చోటుచేసుకుంటుంటాయి. కొన్ని సందర్భాల్లో భక్తుల అత్యుత్సాహం కారణంగా కావచ్చు, పొరపాటున కావచ్చు ప్రాణాలను సైతం పోగొట్టుకుంటున్నారు. ప్రతి ఏడాది నిమజ్జన వేడుకల సందర్భంగా ఏదో ఒకచోట విషాద సంఘటనలు జరుగుతున్నాయి. ఎలాంటి అపశ్రుతులు లేకుండా వినాయక చవితి వేడుకలు సంతోషంగా ముగియాలంటే భక్తులంతా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గత రెండు రోజులుగా విశేష పూజలందుకున్న గణపయ్య నిమజ్జన వేడుకలు మూడవ రోజైన సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అనేక ఉత్సవ కమిటీల ప్రతినిధులు గణనాథుని నిమజ్జన వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. నిమజ్జనం సందర్భంగా పలు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ ప్రతి ఏడాది ఏదో ఒకచోట ఏదో ఒక దురదృష్ట సంఘటన జరుగుతూనే ఉంది.

గత ఏడాది ట్రాక్టర్‌పై నుంచి పల్టీ కొట్టబోయి..

వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా గత ఏడాది మన్నూరుకు చెందిన ఓ వ్యక్తి పాతబస్టాండ్ సర్కిల్‌లో ట్రాక్టర్‌పై నుంచి పల్టీకొట్టబోయి అదుపు తప్పి తల మధ్యభాగం రోడ్డుకు బలంగా తగిలింది. దీంతో ఆ వ్యక్తి అక్కడే కదలలేని స్థితికి చేరుకొని జీవచ్ఛవంలా మారిపోయాడు. కుటుంబ సభ్యులు తిరుపతిలోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో చేర్పించగా తలలోని నరాలు బాగా దెబ్బతినడంతో దాదాపు పదిరోజుల పాటు చికిత్స పొంది చివరికి మృత్యువాత పడ్డాడు. మృతుడి అత్యుత్సాహం ఆ కుటుంబంలో తీరని విషాదం నింపింది.

మూడేళ్ల క్రితం నీటమునిగి మృతి చెందిన విద్యార్థి

సరిగ్గా మూడేళ్ల క్రితం రాజంపేట పట్టణం ఆర్‌ఎస్ రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జన వేడుకలో ప్రభుత్వ హైస్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్న జగన్నాథం అనే విద్యార్థి మృతి అప్పట్లో పట్టణ వాసులను విషాదంలో ముంచింది. ఊరేగింపు కార్యక్రమం ఆలస్యం కావడంతో కూచివారిపల్లెకు సమీపంలో ఉన్న చెక్‌డ్యాంక్ వద్దకు వెళ్లేసరికి రాత్రి వేళ అయింది. ఆ సమయంలో విగ్రహాన్ని నీటిలోకి దించేందుకు జగన్నాథం నీటిలోకి దిగాడు. అయితే చెక్‌డ్యాం లోతుగా ఉండటంతో నీటమునిగిపోయి మృతి చెందాడు.

ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి

- వినాయక విగ్రహాలను చీకటి పడకముందే నిమజ్జనం చేయాలి.
- విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు పెద్దలు మాత్రమే నీటిలో దిగాలి.
- పిల్లలు ఎవరిని కూడా నీళ్లు ఉన్న దరిదాపుల్లోకి రాకుండా చూసుకోవాలి.
- నిమజ్జనానికి తక్కువ సంఖ్యలో వెళ్లాలి.
- నిమజ్జనం పూర్తయ్యాక వెళ్లినవారంతా ఉన్నారా లేదా అని సరిచూసుకోవాలి.
- నిమజ్జనం సందర్భంగా అనేక మంది అత్యుత్సాహంతో చేతిలో టపాసులు పెట్టుకొని కాల్చుతుంటారు. అలా చేయడం చాలా ప్రమాదకరం. అందువల్ల ఉత్సవ కమిటీలు టపాసులు కాల్చే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- కర్రసాము వంటివి చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- విద్యుత్ తీగలు తగలకుండా ఉండేలా వాహనంపై విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలి.
- ట్రాక్టర్లపై నుంచి కాని నేలపై నిల్చొని కూడా పల్టీలు వంటివి కొట్టకూడదు.

మా బాధ పగవాడికి కూడా రాకూడదు



మూడేళ్ల క్రితం వినాయక నిమజ్జన వేడుకల్లో నా కన్నబిడ్డ నీళ్లలో పడి మృతి చెందాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నేను, నా భార్య మానసిక క్షోభ అనుభవిస్తున్నాం. బతికుంటే ప్రతి సంవత్సరం ఎంతో ఆనందంగా పండుగలు జరుపుకోవచ్చు. అందువల్ల ఎవ్వరు కూడా నిమజ్జనం సందర్భంగా అత్యుత్సాహాన్ని ప్రదర్శించవద్దు. మా బాధ పగవాడికి కూడా రాకూడదు.

- రమణ, కృష్ణానగర్, రాజంపేట

జీవితం ఎంతో విలువైనది



ఈ ప్రపంచంలో ఒక్కసారి పోతే తిరిగి తెచ్చుకోలేనిది ప్రాణం ఒక్కటే. అందువల్ల వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకల్లో పాల్గొనే ప్రతి ఒక్కరు కూడా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఉత్సవ కమిటీలు నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా ముగిసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలి. ముఖ్యంగా పిల్లలు, యువత అత్యుత్సాహాన్ని ప్రదర్శించవద్దని ప్రత్యేకంగా కోరుతున్నా. నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా ముగిసేందుకు పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంది.

- కె.యల్లమరాజు, అర్బన్ సీఐ, రాజంపేట

వేటగాళ్ల ఉచ్చుకు రైతు బలి

- అడవి జంతువుల కోసం తీసిన కరెంటు తీగలు తగిలి మృత్యువాత
- పండుగ పూట ఇంటి పెద్ద మృతి చెందడంతో శోక సంద్రంలో కుటుంబం
- నలుగురు నిందితులపై కేసు నమోదు



మృతి చెందిన రైతు రామచంద్ర

మదనపల్లె : అడవి జంతువులను వేటాడేందుకు వేటగాళ్లు తీసిన కరెంటు ఉచ్చులో అభం శుభం తెలియని అమాయక రైతు చిక్కుకుని తనువు చాలించిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. శనివారం ఉదయం వినాయకచవితి పండుగను ఘనంగా జరుపుకుందామనుకున్న టేకులపాళెం గ్రామస్తులకు, రైతు మరణవార్త తీరని శోకాన్ని మిగిల్చింది. తాలూకా సీఐ కె.కళావెంకటరమణ కథనం మేరకు.. మదనపల్లె మండలం సందిరెడ్డిపల్లె సమీపంలోని అడవివాగుకు నీటికోసం వచ్చే జంతువులను వేటాడేందుకు కాడిమానుగుట్ట వద్ద కొందరు వ్యక్తులు శుక్రవారం సాయంత్రం కరెంటు తీగలను అమర్చారు. బొమ్మనచెరువు గ్రామం టేకులపాలెంకు చెందిన రైతు రామచంద్ర అడవికి తోలుకెళ్లిన మేకలు తప్పిపోవడంతో వాటిని వెదికే క్రమంలో వేటగాళ్లు ఉచ్చు కోసం లాగిన కరెంటు తీగలు తగిలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. అవే తీగలకు తగులుకుని ఓ అడవి పంది సైతం చనిపోయింది. శనివారం తెల్లవారుజామున అడవిలోకి వెళ్లిన స్థానికులు చనిపోయిన వ్యక్తిని టేకులపాలెంకు చెందిన జోకుంట్ల చంద్ర అలియాస్ రామచంద్ర(48)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని కుటుంబీకులు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. తాలూకా సీఐ కళా వెంకటరమణ, ఎస్ఐ రవికుమార్‌లు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో కాడిమానుగుట్ట వద్ద వాగులో కరెంటు తీగలు అమర్చిన వారిని మాలేపాడుకు చెందిన కదిరప్ప, శీను, దండువారిపల్లెకు చెందిన నాగరాజ, వేణులుగా గుర్తించి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

కత్తులు, బీరు బాటిళ్లతో దాడి

ఇద్దరు డ్రైవర్లపై హత్యాయత్నం



గాయపడిన రెడ్డెప్ప



తీవ్రంగా గాయపడిన నిరంజన్ రెడ్డి

కురబలకోట : కురబలకోట మండలం అంగళ్లు సమీపంలో కదిరి రోడ్డులోని ఓ కళాశాల సమీపంలో శనివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇందులో ఓ వర్గానికి చెందిన డ్రైవర్లపై హత్యాయత్నం జరిగింది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని మద్యంవారిపల్లెకు చెందిన నిరంజన్ రెడ్డి (30) అద్దె బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను మరో ట్రాక్టర్ డ్రైవర్ సీటీఎం ప్రాంతం గంగాపురానికి చెందిన రెడ్డెప్ప (21)తో కలసి శనివారం స్వగ్రామం మద్యంవారిపల్లెకు మోటార్ సైకిల్‌పై బయలు దేరాడు. స్థానిక కదిరి రోడ్డులోని ఓ కళాశాల వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనదారుడు ఢీకొన్నాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుని దాడికి దిగారు. దీంతో దెబ్బలు తిన్న వ్యక్తి ఫోన్ చేయడంతో కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో ఉన్న రెండు కార్లలో మనుషులు వచ్చారు. డ్రైవర్లపై కత్తులు, బీరుబాటిళ్లతో దాడులు చేశారు. డ్రైవర్ నిరంజన్‌రెడ్డికి కత్తిపోట్లతోపాటు బీరుబాటిల్‌తో కొట్టిన గాయాలయ్యాయి. మరో డ్రైవర్ రెడ్డెప్ప కూడా ఈ దాడిలో గాయపడ్డాడు. హుటాహుటిన వీరిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై బాధితుల నుంచి ఫిర్యాదు అందగానే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి



మృతి చెందిన రైతు రెడ్డిమోహన్

నిమ్మనపల్లె : మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ కొండసానివారిపల్లెలో రైతు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. కొత్త కొండసానివారిపల్లెకు చెందిన రైతు ఆర్.రెడ్డిమోహన్(56) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. అతనికి భార్య సుశీలమ్మ, కుమారుడు సుదర్శన్, కుమార్తె త్రివేణి ఉన్నారు. సుదర్శన్ మిలిటరీలో ఉద్యోగం చేసి ప్రస్తుతం నిమ్మనపల్లెలోని ఆంజనేయస్వామి గుడి వద్ద సిమెంట్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఏడాది క్రితం కలకడ మండలం కదిరాయచెరువు పంచాయతీ బొంతలవారిపల్లెకు చెందిన శ్రీనాథ్, సుమతి దంపతుల కుమార్తె భానుమతితో సుదర్శన్‌కు వివాహమైంది. కొన్నాళ్లపాటు సజావుగా సాగిన కాపురంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. భానుమతి పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దమనుషుల పంచాయతీతో తిరిగి అత్తగారిల్లు అయిన కొండసానివారిపల్లెకు వచ్చింది. అయినా తరచూ వీరిమధ్య గొడవలు జరగడం, విభేదాలు తలెత్తడంతో కాపురంలో ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో భానుమతి తండ్రి శ్రీనాథ్ తన ఇద్దరు భార్యలు సుమతి, రమాదేవితో కలిసి శనివారం కొత్త కొండసానివారిపల్లెకు వచ్చాడు. రాత్రి మొత్తం ఇరుకుటుంబాల వారు కుటుంబ సమస్యలపై చర్చించుకున్నారు. ఆదివారం ఉదయం సుదర్శన్ తండ్రి రెడ్డిమోహన్ పొలంపనుల కోసం పులిగడ్డ వద్ద ఉన్న పొలం వద్దకు వెళ్లాడు. అదే సమయంలో వియ్యంకుడైన శ్రీనాథ్ సైతం కనిపించకుండా పోయాడు. తిరిగి ఇంటికి వచ్చిన శ్రీనాథ్ కుండ పగిలిపోయింది. ఇక పంచాయతీ అవసరం లేదు పదండంటూ తనతో పాటు వచ్చిన వారిని తీసుకుని వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. అంతలోనే పొలం వద్ద రెడ్డిమోహన్ చెట్టుకు వేలాడుతున్నట్లు స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు పొలం వద్దకు చేరుకుని పరిశీలించగా డ్రిప్ పైపుతో మెడకు ఉరివేసుకుని చెట్టుకు వేలాడుతూ రెడ్డిమోహన్ మృతదేహం కనిపించింది. గతంలో రెడ్డిమోహన్ కుటుంబాన్ని అంతమొందిస్తానని వియ్యంకుడు శ్రీనాథ్ దిరించడం, ఆదివారం ఉదయం మరణవార్తకు ముందుగానే ఇంటి వద్దకు వచ్చి కుండపగిలింది. పంచాయతీ అవసరం లేదని చెప్పడంతో అనుమానం బలపడింది. మృతుడి కుమారుడు సుదర్శన్ ఫిర్యాదు చేశాడు. ఇన్‌చార్జి ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలంలో, గ్రామంలో విచారించారు. కేసు నమోదు చేశారు.

దాడి ఘటనపై కేసు నమోదు

మదనపల్లె : దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. శనివారం రాత్రి పట్టణంలోని ఈశ్వరమ్మకాలనీకి చెందిన షేక్ సయ్యద్‌షావలీ(26) తన స్నేహితులు సద్దాం, రఫీక్‌లతో కలిసి బడేమకాన్ వద్ద ఉండగా, దేవలం వీధికి చెందిన జావీద్, ఈ సమయంలో ఇక్కడ ఏం చేస్తున్నారంటూ వారితో గొడవకు దిగాడు. ఆవేశానికి లోనైన జావీద్ తన ద్విచక్రవాహనంలో ఉన్న రాడ్‌ను తీసుకుని, సయ్యద్‌షావలీపై దాడి చేశాడు. బాధితుడిని మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

విషాదం మిగిల్చిన ప్రయాణం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి
నలుగురికి తీవ్ర గాయాలు



దత్తాపురం రమణ (ఫైల్)



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దత్తాపురం రమణ



సుంకేసుల సుభాన్ (ఫైల్)



ఆసుపత్రిలో వైద్యం పొందుతూ మృతి చెందిన సుకేసుల సుభాన్

సిద్దవటం : కడప-చెన్నై ప్రధాన రహదారిలోని వాసవీ కళాశాల సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సాలాబాదుకు చెందిన ఆటో డ్రైవర్ సుంకేసుల సుభాన్ ప్రయాణికులను తీసుకొని కడపకు బయలుదేరారు. కడప నుంచి ఒంటిమిట్ట వైపు కారు వెళుతోంది. సిద్దవటం మండలంలోని వాసవీ కళాశాల సమీపంలోకి రాగానే కారు గేదెను ఢీకొంది. దీంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో గేదెతో సహా ఒంటిమిట్ట మండలం మృకుండాశ్రమానికి చెందిన దత్తాపురం రమణ(35)అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఆటోడ్రైవర్ సుంకేసుల సుభాన్ (21) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతనికి ఒంటిమిట్ట మండలం మంటపంపల్లె గ్రామానికి చెందిన నూర్జహాన్‌తో మూడు నెలల క్రితం వివాహమైంది. మృతుడు రమణతో పాటు గాయపడిన అతని కుమారుడు సాయి మధుసూదన్, బావ మరిది ఇరువురు వెంకటరమణ కడపలో ఓ క్లాథ్ రశాలలో పనిచేస్తున్నారు. ఆదివారం గిరాకీ ఎక్కువగా ఉంటుందని వారు తెల్లవారు జామునే ఆటోలో కడపకు బయలుదేరారు. ప్రమాదంలో రమణ అక్కడికక్కడే మృతి చెందగా, వీరు తీవ్రంగా గాయపడ్డారు. వీరితో పాటు మాధవరానికి చెందిన రాజశేఖర్‌కు గాయాలయ్యాయి. అలాగే గోపవరం మండలం బేదయిపాళెం గ్రామానికి చెందిన ఓబులం వెంకటసుబ్బయ్య ఇబ్రహీంపేటలో తన బంధువుల వద్దకు వచ్చి తిరిగి స్వగ్రామానికి ఇదే ఆటోలో వెళ్తుండగా ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యుల సూచన మేరకు సాయి మధుసూధన్, ఇరువురు వెంకటరమణ, ఓబులం వెంకటసుబ్బయ్యలను తిరుపతికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్–బైక్ ఢీ



దిలీప్(ఫైల్)

పెద్దముడియం : జమ్మలమడుగు–పెద్దపసుపుల రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దపసుపుల గ్రామానికి చెందిన దిలీప్ కుమార్ (23) మృతి చెందాడు. పెద్దపసుపుల గ్రామానికి చెందిన శామ్యూల్, బుజ్జి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా చిన్న కుమారుడు దిలీప్ కుమార్ కడపలో ఉద్యోగం చేస్తున్నాడు. వ్యక్తిగత పనుల మీద ఇంటికి వచ్చిన అతను తిరిగి శనివారం కడపకు బయలుదేరాడు. జమ్మలమడుగుకు 3 కిలోమీటర్ల దూరంలో ట్రాక్టర్–బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో దిలీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడున్న వారు వెంటనే 108 వాహనానికి ఎన్ని సార్లు ఫోన్ చేసినా ప్రమాద స్థలానికి రాలేదు. దీంతో దాదాపు గంట తరువాత ఆటోలో జమ్మలమడుగుకు తీసుకెళ్లారు. అప్పటికే యువకుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


ట్రాక్టర్ ఢీకొని..



వెంకటేశ్వర్లు (ఫైల్)

బద్వేలు అర్బన్ : పట్టణంలోని పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోపవరం మండలం కాలువపల్లె పంచాయతీ గొల్లపల్లె గ్రామానికి చెందిన బైరారపు వెంకటేశ్వర్లు (39) బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఈయనకు భార్య స్వప్నతో పాటు ఆరుగురు పిల్లలు ఉన్నారు. గొల్లపల్లె దళితవాడలో జరగనున్న వినాయకచవితి ఉత్సవాలకు విగ్రహం కొనుగోలు చేసేందుకు గ్రామస్తులతో పాటు శుక్రవారం రాత్రి పట్టణానికి వచ్చిన వెంకటేశ్వర్లు తిరిగి గ్రామానికి వెళుతున్న సమయంలో బైపాస్‌రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గమనించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. వినాయకచవితి ఉత్సవాలలో భాగంగా విగ్రహం కొనుగోలుకు వెళ్లి వెంకటేశ్వర్లు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు ఉత్సవాలను రద్దు చేసుకున్నారు.

ఎదురెదురుగా మోటారు బైకులు ఢీకొని..



మృతి చెందిన షేక్ షారిక్

వల్లూరు : కడప- తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు మండల పరిధిలోని సత్యా గ్రీన్ సిటీ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కడప నగరానికి చెందిన షేక్ షారిక్ (13) అనే బాలుడు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు కడప అల్మాస్‌పేటకు చెందిన షేక్ షారిక్, మహమ్మద్ అమాన్, షాబాద్ అనే ముగ్గురు బాలురు స్నేహితులు. వీరు శనివారం సాయంత్రం సరదాగా మోటార్ బైక్‌లో కమలాపురం వచ్చారు. తిరిగి కడపకు వెళ్లే క్రమంలో సత్యా గ్రీన్ సిటీ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో మోటారు బైక్‌ను ఢీకొట్టారు. దీంతో వారిలో షేక్ షారిక్ అనే బాలుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు ద్విచక్రవాహనంలో ఉన్న మహమ్మద్ అమాన్, షాబాద్‌లతో బాటు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనంలోని పెద్దచెప్పలికి చెందిన వేణుగోపాల్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 వాహన సిబ్బంది అక్కడికి చేరుకుని తీవ్రంగా గాయపడిని ముగ్గురిని చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతి చెందిన షేక్ షారిక్ కడపలోని ఓ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్నట్లు తెలిసింది.

టెంపో ఢీకొని రైతు దుర్మరణం



మృతి చెందిన రైతు రామ్మోహన్

మదనపల్లె : టెంపో ఢీకొని రైతు దుర్మరణం పాలైన ఘటన ఆదివారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. వేంపల్లెకు చెందిన రామ్మోహన్(45) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వచ్చాడు. పని ముగించుకుని స్వగ్రామానికి వెళుతుండగా, మార్గమధ్యంలో చిప్పిలి వద్ద టెంపో ఢీకొంది. దీంతో అక్కడికక్కడే రామ్మోహన్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

విద్యార్థికి గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యార్థి గాయపడిన సంఘటన ఆదివారం కురబలకోట మండలంలో జరిగింది. మదనపల్లెకు చెందిన విద్యార్థి మాలిక్, వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో గోల్డెన్‌వ్యాలీ కళాశాలకు వెళ్లి తిరిగి సాయంత్రం వస్తుండగా, సర్కారుతోపు వద్ద వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి..

మదనపల్లె : ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం గుర్రంకొండ మండలంలో జరిగింది. మామిళ్లవారిపల్లెకు చెందిన తాతయ్య కుమారుడు రెడ్డెప్ప(45) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో గుర్రంకొండకు వస్తుండగా, చెరువుకట్ట సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కాగా గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి సిఫార్సు చేశారు. గుర్రంకొండ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపంతో భర్త ఆత్మహత్యకు యత్నించిన సంఘటన ఆదివారం గుర్రంకొండ మండలంలో జరిగింది. ఎల్లుట్ల పంచాయతీ కల్లూరివారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు శ్రీనివాసులు(40), భార్య కుటుంబ సమస్యల కారణంగా భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. ఎంత సర్దిచెప్పినా ఆమె తిరిగి రాకపోవడంతో మనస్తాపం చెందిన శ్రీనివాసులు ఇంటివద్దే పురుగుమందు తాగాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతికి సిఫార్సు చేశారు.

కాపర్ వైర్లు చోరీ

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కస్తూరిరాజుగారిపల్లి పంచాయతీ, గురవయ్యగారిపల్లి సమీపంలో బోరు మోటార్లకు ఉన్న కేబుల్ వైర్‌లోని కాపర్‌వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రైతులు రమణ, సుబ్బమ్మలకు చెందిన బోరు మోటార్లకు ఉన్న కేబుల్ వైర్‌ను దొంగలు కట్ చేసి అందులో ఉండే కాపర్ వైర్‌ను తీసుళ్లారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే మూడు పర్యాయాలు దొంగలు బోర్లకు సంబంధించిన కాపర్ వైర్‌ను తీసుకెళ్లడంతో పంటలు సాగుచేసుకోలేని పరిస్థితిలో ఉన్నామంటూ పలువురు రైతులు వాపోతున్నారు. ఇప్పటికే లక్కిరెడ్డిపల్లి పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేశామని, అయినా కూడా దొంగలు రెచ్చిపోతున్నారని రైతులు తెలుపుతున్నారు.

నిర్వాసితులకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ గనుల విస్తరణలో 2012వ సంవత్సరంలో ఇల్లు, భూములు కోల్పోయిన నిర్వాసిత బీసీ కుటుంబాలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం మంగంపేట అయ్యప్పరెడ్డిపల్లె పునరావాస బాధితులతో సమావేశం నిర్వహించారు.

వినాయక మండపంలో ప్రమాదం

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



చరణ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని రామేశ్వరంలో పండుగ పూట విషాదం చోటు చేసుకుంది. వినాయక మండపంలో విద్యుత్ షాక్ తగిలి ఉండేల చరణ్‌కుమార్‌రెడ్డి (24) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. రామేశ్వరంలోని రెడ్డిగారివీధిలో ఆ ప్రాంత యువకులందరూ కలిసి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. శనివారం నుంచి వినాయక మండపం వద్ద భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం పట్టణంలో పెద్ద ఎత్తున ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఈ క్రమంలో మండపంలో ఉన్న చరణ్‌కుమార్‌రెడ్డికి విద్యుత్ షాక్ తగలడంతో అతను కింద పడిపోయాడు. దీంతో విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపేసి చరణ్‌కుమార్‌రెడ్డిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యుడు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపాడు. చరణ్‌కుమార్‌రెడ్డి తండ్రి చంద్రశేఖర్‌రెడ్డి చెనక్కాయల మిల్లులో పని చేస్తుంటాడు. ఆయనకు చరణ్‌కుమార్‌రెడ్డితో పాటు సతీష్‌రెడ్డి అనే మరో కుమారుడు ఉన్నారు. పండుగ వేళ సంతోషంగా ఉండాల్సిన ఆ ఇంట విషాదం చోటు చేసుకుంది. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లి వసంత తల్లడిల్లిపోయింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

రాయచోటిలో..

రాయచోటి టౌన్ : వినాయకుడిని ప్రతిష్ఠించేందుకు ఏర్పాటు చేస్తున్న మంటపంలో విద్యుత్ షాక్‌తో మహేష్ (13) అనే బాలుడు మృతి చెందాడు. అర్బన్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం తెల్లవారు జామున రాయచోటి పట్టణ పరిధిలో చిత్తూరు రోడ్డులోని టీవీఎస్ షోరూం వెనుక భాగాన స్థానికులు వినాయకుడి మంటపాన్ని నిర్మిస్తున్నారు. ఈ మంటపం నిర్మాణంలో భాగంగా విద్యుత్ వైరు లాగుతున్న సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. బాలుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.